
సాక్షి
తూర్పుగోదావరి

గురువారం । 26 । జనవరి । 2023



రత్నగిరిపై హైకోర్టు జడ్జి

అన్నవరం: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులైన జిల్లా జడ్జి పి.వేంకట జ్యోతిర్మయి కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం సత్యదేవుని దర్శించుకున్నారు.



డెల్టాలకు నీరు విడుదల

ధవళేశ్వరం: బ్యారేజీ నుంచి బుధవారం 9,100 క్యూసెక్కులు విడుదల చేశారు. తూర్పు 2,650, మధ్య 1,850, పశ్చిమ డెల్టాలకు 4,600 క్యూసెక్కులు వదిలారు.

సార్వత్రిక విద్యకు సై



ఉన్నత చదువు చదవాలని ఆశ పడినప్పటికీ అనుకోని అవాంతరాలు. ఆర్థిక ఇబ్బందులతో మధ్యలోనే ఫుల్‌స్టాప్ పెట్టేసిన వారు నిరాశ పడాల్సిన అవసరం లేదు. వివాహమైన తర్వాత.. పెద్ద వయను వచ్చేసిన తర్వాత చదువుకోలేకపోయామే అని దిగులు పడేవారున్నారు.

8లో

న్యూస్‌రీల్

లబ్ధిదారులతో కేంద్రమంత్రి ముఖాముఖి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి దేవుసిన్హ చౌహాన్

కడియం: కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి దేవుసిన్హ చౌహాన్ బుధవారం ముఖాముఖి మాట్లాడారు. కడియం మండల పరిషత్ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. ఉపాధి హామీ, గ్రామీణ గృహకల్ప, పీఎం కిసాన్, ఆరోగ్య, జల్‌జీవన్ మిషన్ తదితర పథకాల లబ్ధిదారులతో మాట్లాడారు. అంతకు ముందు ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ మాట్లాడుతూ కడియం మండలాన్ని టూరిజం ప్రాంతంగా గుర్తించి రూ. 25 కోట్లు కేటాయించాలని కోరారు. ఆర్థిక సంఘం నిధులు నేరుగా పంచాయతీల ద్వారా ఖర్చు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కడియపులంక పంచాయతీ పరిధిలో నిర్మించిన రోడ్డును చౌహాన్ పరిశీలించారు. మండల బీజేపీ అధ్యక్షుడు కొటికలపూడి వెంకటేశ్వరరావు ఇంటి వద్ద కొద్దిసేపు మంత్రి చౌహాన్ ఆగారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు సోము వీర్రాజు, జిల్లా బీజేపీ అధ్యక్షుడు బొమ్ముల దత్తు, డీఎల్‌డీవో వీణాదేవి, తాహసీల్దార్ సుజాత, హౌసింగ్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.


క్రికెట్ విజేత రెవెన్యూ జట్టు

అనపర్తి: గణతంత్ర దిన వేడుకల్లో భాగంగా స్థానిక జీబీఆర్, జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ప్రభుత్వోద్యోగులకు మూడు రోజుల పాటు నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు బుధవారంతో ముగిశాయి. జిల్లా పరిధిలో 11 ప్రభుత్వ శాఖల ఉద్యోగులు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. బుధవారం ఫైర్ డిపార్ట్‌మెంట్‌తో జరిగిన సెమీఫైనల్స్‌లో రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ (ఆర్ఎంసీ)– జట్టు విజయం సాధించి ఫైనల్స్‌కు చేరింది. అనంతరం రెవెన్యూ– ఆర్ఎంసీ జట్లు ఫైనల్స్‌లో తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన ఆర్ఎంసీ జట్టు క్రీడాకారులు నిర్ణీత 14 ఓవర్లలో 10 వికెట్లు కోల్పోయి 70 పరుగులు చేశారు. 71 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన రెవెన్యూ జట్టు 10 ఓవర్లలో 4 వికెట్లు నష్టపోయి 71 పరుగులు సాధించింది. టోర్నమెంట్ విన్నర్స్‌గా నిలిచిందని పీడీ పి.శ్రీనివాసరెడ్డి తెలిపారు.

లోవ హుండీల ఆదాయం రూ.47.74 లక్షలు

తుని రూరల్: తలుపులమ్మ అమ్మవారికి భక్తుల హుండీల ద్వారా రూ.47.74 లక్షల సమకూరినట్టు లోవ దేవస్థానం కార్యనిర్వహణ అధికారి పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. బుధవారం పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి దేవస్థానం ఈఓ సీహెచ్ రామ్మోహనరావు పర్యవేక్షణలో లోవ దేవస్థానం హుండీలను తెరిచి లెక్కించారు. 64 రోజులకు నాణేలు రూ.2,37,588, నోట్లు రూ.45,37,108 వెరసి రూ.47,74,696 ఆదాయం సమకూరిందన్నారు. బంగారం 15 గ్రాముల 340 మిల్లీగ్రాములు, వెండి 762 గ్రాములు వచ్చిందన్నారు. లెక్కింపులో సిబ్బంది, తుని, విశాఖపట్నంకు చెందిన శ్రీవారి సేవకులు, చైతన్య గోదావరి బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

రత్నగిరి సత్రాలలో గదుల వివరాలు



25-Jan-2023 04:34 PM

ROOMS VACANT POSITION

[illegible]	Name of the Choultry	Total Rooms	[illegible]	[illegible]	[illegible]
1	Prakash Sadan	85	45		40
2	Hari Hara Sadan AC	84	61		23
	Hari Hara Sadan Non AC	51	35		16
	Harihara Sadan Single	4	4		0
3	New Centenary Cottage	48	36	1	11
4	Old Centenary Cottage	48	28	1	19
5	30 VIP S.G.H	60	30	5	25
6	Seeta Rama Choultry (SRC)	94	67	8	19
7	Satyaniketan DH	64	16	14	34

బుధవారం సాయంత్రం రత్నగిరి సత్రాల్లో గదుల ఖాళీల వివరాలు

అన్నవరం: శ్రీవీరవేంకట సత్యనారాయణ స్వామి దేవస్థానానికి వచ్చే భక్తుల కోసం సత్రాలలో గదుల ఖాళీ వివరాలను ఎప్పటి కప్పుడు తెలియచేసే పద్ధతికి దేవస్థానం అధికారులు శ్రీకారం చుట్టారు. గతంలో ఏ సత్రంలో ఎన్ని గదులు ఖాళీ ఉన్నాయో తెలిసేది కాదు. ప్రస్తుతం ఏ సత్రంలో ఎన్ని గదులు ఖాళీ ఉన్నాయో దేవస్థానం ఉద్యోగుల గ్రూపుతో పాటు, దేవస్థానం మీడియా గ్రూపులో పోస్టు చేస్తున్నారు. దేవదాయశాఖ వెబ్‌సైట్‌లో కూడా ఖాళీ వివరాలు పెడుతున్నారు. దీనిపై దేవస్థానం సన్నిధి సూపరింటెండెంట్ ఐవీ రామారావు 'సాక్షి' తో మాట్లాడుతూ దేవస్థానం ఈఓ సత్యనారాయణమూర్తి ఆదేశాల మేరకు ఖాళీల వివరాలను సత్రాల వారీగా ఉదయం 8, సాయంత్రం 4, రాత్రి 9 గంటల సమయంలో వెల్లడిస్తున్నామన్నారు.

సేవలకు పద్మాసనం

- సంకురాత్రి చంద్రశేఖర్‌కు ప్రతిష్టాత్మక పురస్కారం
- విశిష్ట సేవలకు గుర్తింపుగా వరించిన పద్మశ్రీ
- కుటుంబాన్ని కోల్పోయినా స్థైర్యం వీడని సేవామూర్తి



అవార్డు ప్రకటన వెలువడగానే పెనుమర్తిలోని శ్రీకిరణ్ కంటి ఆస్పత్రిలో డాక్టరు చంద్రశేఖర్‌కు కేక్ తినిపిస్తున్న సోదరి





విమాన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన డాక్టర్ చంద్రశేఖర్ భార్య మంజరి, కుమారుడు కిరణ్, కుమార్తె శారద (ఫైల్)

కాకినాడ రూరల్: చిన్న చిన్న విషయాలకే చాలా మంది నిరాశ చెందుతారు. చిన్న కష్టానికే దిగులు పడతారు. అన్నీ కోల్పోయినట్లు భావిస్తారు. కానీ ఆయన అలా కాదు. భార్య..పిల్లలు విమాన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయినా ఇంక తానెందుకు బతకాలి అని భావించలేదు. తానొక్కడే మిగిలినా నైరాశ్యాన్ని ..ఒంటరితనాన్ని దరిచేరనివ్వలేదు.. మూడు దశాబ్దాలుగా తన జీవితాన్ని సేవారంగానికే అంకితం చేశారు. ఆయనెవరో కాదు.. సంకురాత్రి ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ సంకురాత్రి చంద్రశేఖర్..తాజాగా ఆయనకు కేంద్రప్రభుత్వం బుధవారం పద్మశ్రీ ప్రకటించింది.1943లో ఒంగోలు జిల్లాలో చంద్రశేఖర్ జన్మించారు. విద్యాభ్యాసం రాజమహేంద్రవరం..విశాఖలో గడిచింది. తర్వాత కెనడాలో ఉన్నతవిద్యనభ్యసించారు. ఒట్టావాలో సైంటిఫిక్ ఎవాల్యులేటరుగా సేవలందించారు. 1975లో కాకినాడలో మంజరిని పెళ్లి చేసుకున్నారు. ఈ దంపతులకు శారద ..శ్రీకిరణ్ సంతానం. అనుకోని దుర్ఘటన ఈయన జీవితాన్ని కుదిపేసింది. విషాద సాగరంలోకి నెట్టేసింది. 1985లో ఐర్లాండ్‌లో కూలిన ఎయిర్ ఇండియా విమాన దుర్ఘటనలో మంజరి..శారద..శ్రీకిరణ్ చనిపోయారు. దీంతో చంద్రశేఖర్ ఒంటరి అయ్యారు. ఈ దశలో ఆయన తనను తానే సముదాయించుకున్నారు. కొద్దికాలంలోనే విషాదం నుంచి బయటపడ్డారు. ప్రాణాలు కోల్పోయిన కుటుంబాన్ని మరో రూపంలో చూసుకోవాలని కొత్త జీవితాన్ని ప్రారంభించారు. సేవాపథంలో పయనించారు. 1989లో భార్య మంజరి పేరిట సంకురాత్రి ఫౌండేషన్‌ను ప్రారంభించారు. మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన విద్యా వైద్య సేవలందించేందుకు ఈ సంస్థ ద్వారా విశేష కృషి చేస్తున్నారు. 1992లో దివంగత కుమార్తె శారద పేరిట విద్యాసంస్థను ప్రారంభించారు. పల్లె ప్రాంతాల్లో పేదపిల్లలకు విద్యనందించేందుకు ఈ సంస్థ ఎంతగానో పాటుపడుతోంది. కుమారుడు కిరణ్ స్మారకార్థం 1993లో సాయి కిరణ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆప్తమాలజీ సంస్థను నెలకొల్పారు. ఎందరి బతుకుల్లోనో 'కిరణ్' వెలుగులు నింపుతోంది.

శ్రీకిరణ్ ఆస్పత్రిలో సందడి

సంకురాత్రి ఫౌండేషన్ ద్వారా దాదాపు మూడు దశాబ్దాలుగా సేవలందిస్తున్నారు. కాకినాడ రూరల్ మండలం పెనుమర్తి వద్ద శ్రీకిరణ్ కంటి ఆస్పత్రి, శారద విద్యా పీఠం నెలకొల్పి విద్యా, వైద్య సేవలతో పాటు అనేక సేవా కార్యక్రమాలను డాక్టరు చంద్రశేఖర్ నిర్వహిస్తున్నారు. శ్రీకిరణ్ కంటి ఆస్పత్రిని 1993 జనవరి 21న ఏర్పాటు చేశారు. ఇప్పటివరకూ 37లక్షల మందికి కంటి సంబంధిత వైద్య సేవలందించారు. 3లక్షల 40వేల మందికి కంటి శస్త్ర చికిత్సలను అందించారు. ఇటీవల శ్రీకిరణ్ ఆస్పత్రి ప్రాంగణంలో 30వ వార్షికోత్సవాన్ని నిర్వహించి ఆస్పత్రి ద్వారా అందించిన కంటి వైద్య సేవలను డాక్టరు చంద్రశేఖర్ వివరించి,. సంతృప్తి వ్యక్తం చేశారు. డాక్టరు చంద్రశేఖర్‌కు పద్మశ్రీ అవార్డు రావడంతో శ్రీకిరణ్ ఆస్పత్రిలో సందడి నెలకొంది. ఆస్పత్రి సిబ్బంది ఆనందోత్సాహంలో మునిగిపోయారు. పద్మ శ్రీ అవార్డుకు ఎంపికైనట్టు తెలుసుకున్న డాక్టరు చంద్రశేఖర్ ఆనందం వ్యక్తం చేశారు.

రత్నగిరిపై సందడే సందడి

మాఘమాసం పెళ్లి బాజా మోగింది



ప్రకాష్ సదన్ సత్రం వద్ద వివాహం కోసం వేసిన మండపం

అన్నవరం: రత్నగిరి సత్యదేవుని సన్నిధిన మాఘమాసం పెళ్లి బాజా మోగింది. బుధవారం అర్ధరాత్రి దాటాక మాఘ శుద్ధ పంచమి, ఉత్తరాభాద్ర నక్షత్రం పర్వదినంలో దేవస్థానంలో వివిధ ప్రదేశాల్లో సుమారు 50 వివాహాలు జరిగాయి. దేవస్థానంలోని రామాలయం ఆవరణ, సత్రాలు, ఎంఎస్ రెడ్డి అంజనీ ఉచిత వివాహ వేదిక, శ్రీ సత్య శ్రీనివాస ఉచిత ఏసీ కల్యాణ మండపంలో ఎక్కువ పెళ్లిళ్లు జరిగాయి. వచ్చే నెల 15వ తేదీ వరకు మాఘ మాసంలోను, తరువాత ఫాల్గుణ మాసంలో మార్చి 13 వ తేదీ వరకు పెళ్లి ముహూర్తాలు ఉన్నాయని పండితులు తెలిపారు. గురువారం తెల్లవారుజామున జరిగే వివాహాలకు పలుచోట్ల పెద్ద పెద్ద మండపాలు ఏర్పాటు చేశారు. విద్యుత్ దీపాలు, పుష్పాలంకరణతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. చాలాకాలం తరువాత వివాహాల సందడి కనిపించింది.మరోపక్క సత్యదేవుని ఆలయానికి భక్తులు కూడా పోటెత్తనున్నారు.



అర్తమూరులో హర్షాతిరేకాలు



అర్తమూరు సన్మాన వేడుకలో చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటున్న స్వామివారు (ఫైల్)

మండపేట: శ్రీతిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామివారికి ప్రతిష్టాత్మకమైన పద్మభూషణ్ అవార్డు రావడం పట్ల ఆయన స్వస్థలమైన మండపేట మండలం అర్తమూరులో పండగ వాతావరణం నెలకొంది. సనాతన ధర్మాన్ని ఖండాంతర వ్యాప్తి చేసిన స్వామివారు 1956 నవంబరు 3వ తేదీన అలివేలు మంగతాయారు, వెంకటచార్యుల దంపతులకు జన్మించారు. వేద విద్యను అభ్యసించిన శ్రీమన్నారాయణ రామానుజాచార్యులు వారు 23 ఏళ్ల వయసులోనే జీయర్ దీక్ష చేపట్టారు. చినజీయర్‌స్వామిగా హిందూ ధర్మ పరిరక్షణకు దేశ విదేశాల్లో ఎనలేని కృషి చేస్తున్నారు. గతంలో పలుమార్లు స్వస్థలమైన అర్తమూరు విచ్చేసిన స్వామివారు స్థానికులతో మమేకమయ్యేవారు. వికాస తరంగిణి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ రంపచోడవరం నియోజకవర్గ పరిశీలకులు కర్రి పాపారాయుడు ఆధ్వర్యంలో 2020 ఫిబ్రవరి 19న టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి నిర్వహించిన సన్మాన వేడుకకు చినజీయర్‌స్వామి వారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అర్తమూరుతో తనకు గల అనుబంధాన్ని, తన చిన్ననాటి జ్ఞాపకాలను స్వామివారు గ్రామస్తులతో పంచుకున్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా స్వామివారికి ప్రతిష్టాత్మమైన అవార్డు రావడంపై ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, పాపారాయుడు, అర్తమూరు గ్రామ సర్పంచ్ గొలుగూరి అన్నపూర్ణ, విజయభాస్కర రెడ్డి దంపతులు, ఏపీ పౌల్ట్రీ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల సుబ్బారెడ్డి, ఎస్‌బీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ సత్తి బులిస్వామిరెడ్డి, ఉప సర్పంచ్ కర్రి సత్యనారాయణరెడ్డి (జంబయ్య), వికాస తరంగిణి సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

గణతంత్ర దినోత్సవానికి సర్వం సిద్ధం

- ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో శకటాల ప్రదర్శన
- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్న కలెక్టర్ మాధవీలత



ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో గణతంత్ర దినోత్సవం ఏర్పాట్లు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): తూర్పుగోదావరి జిల్లా ఏర్పడిన తరువాత తొలిసారిగా బుధవారం నిర్వహిస్తున్న గణతంత్ర దినోత్సవానికి రాజమహేంద్రవరంలోని ఆర్ట్స్ కళాశాల ప్రాంగణం సర్వం సిద్ధమైంది. ప్రాథమికంగా తొమ్మిది శాఖలకు చెందిన శకటాల ప్రదర్శన ఏర్పాటు చేయనున్నారు. ఇందులో వైద్య ఆరోగ్య, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, విద్య, వ్యవసాయ అనుబంధ శాఖలు, పంచాయతీ రాజ్, డ్వామా, డీఆర్‌డీఏ, మెప్మా, హౌసింగ్, టిడ్కో, సంక్షేమం, ఆర్‌డబ్ల్యూఎస్ వంటి ఎనిమిది శకటాలు ప్రదర్శించనున్నారు. గణతంత్ర దినోత్సవ నిర్వహణపై కలెక్టర్ మాధవీలత, జేసీ తేజ్‌భరత్ కళాశాల ప్రాంగణాన్ని పరిశీలించి, అధికారులకు సూచనలు చేశారు. పోలీస్, రెవెన్యూ, మున్సిపల్ కార్పొరేషన్, విద్యుత్ శాఖ, వైద్య ఆరోగ్య తదితర శాఖల ద్వారా చేపట్టిన కార్యక్రమాల పురోగతిపై వివరాలు తెలుసుకున్నారు. అధికారుల ప్రోటోకాల్, వీవీఐపీ గ్యాలరీ, మీడియా గ్యాలరీల సిట్టింగ్ ఏర్పాట్లు, అల్పాహారం, ప్రముఖులకు ఆహ్వానం వివరాలు తెలుసుకున్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

జిల్లా కలెక్టర్ మాధవీలత



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ మాధవీలత తదితరులు

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): పిల్లలు చెడు అలవాట్లకు బానిస కాకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని కలెక్టర్ మాధవీలత అన్నారు. పిల్లల సంరక్షణ చట్టానికి సంబంధించి స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం జరిగిన జిల్లా స్థాయి సంయుక్త కార్యాచరణ కమిటీ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డాక్టర్ల సిఫార్సు లేకుండా మత్తు మందుల విక్రయాలు జరగకుండా చూడాలన్నారు. మెడికల్ షాప్ వద్ద విధిగా సీసీ టీవీ ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. పాఠశాలలకు దగ్గరగా మద్యం దుకాణాలు ఉంటే తొలగించి వివరాలు అందజేయాలన్నారు. స్కూల్ సమీపాన డ్రగ్స్, సిగరెట్లు షాపులుంటే వివరాలు సేకరించాలన్నారు. తక్షణం పాఠశాలలకు దూరంగా తరలించాలన్నారు. చైల్డ్ వెల్ఫేర్, పోలీస్, విద్య తదితర శాఖలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమాల గురించి తెలుసుకున్నారు. డ్రగ్స్.. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండేలా పిల్లలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు.

డీ–అడిక్షన్ సెంటర్లు ఏర్పాటు

జిల్లాలో డీ–అడిక్షన్ సెంటర్ల గురించి కలెక్టర్ ఆరా తీశారు. ఈ కేంద్రంలో నమోదైన కేసుల సంఖ్యపై అధ్యయనం చేయాలని సూచించారు. 18 సంవత్సరాల కంటే తక్కువ వయస్సున్న పిల్లలలో పొగాకు, మద్యం విక్రయాల నిషేధానికి సంబంధించి అవగాహన కలిగేలా పలు ప్రదేశాల్లో హోర్డింగ్‌లు ప్రదర్శించాలన్నారు. డ్రగ్స్, మత్తు పదార్థాలను ఉపయోగించే అవకాశమున్న పిల్లలను గుర్తించి నిరంతరం పర్యవేక్షించాలన్నారు. జిల్లా ఆసుపత్రిలో డీ–అడిక్షన్ కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. ప్రైవేట్ సంస్థలు నిర్వహించే కేంద్రాలను పరిశీలించాలన్నారు. సమావేశంలో ఐసీడీఎస్ జిల్లా అధికారి విజయకుమారి, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి (కాకినాడ) జనార్దనరావు, అదనపు ఎస్పీ సీహెచ్ పాపారావు,డీసీహెచ్ఎస్ డా సనత్ కుమారి, డీఈఓ అబ్రహం, డీసీపీఓ వెంకట్రావు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

తేరుమెరుగులు

- భీమేశ్వరునికి సిద్ధమవుతున్న నూతన రథం
- రూ.1.50 కోట్ల వ్యయం
- 27 అడుగుల ఎత్తున నిర్మాణం
- చకచకా పనులు



శరవేగంగా రూపుదిద్దుకుంటున్న నూతన రథం

రామచంద్రపురం: దక్షిణ కాశీగా ప్రసిద్ధికెక్కిన ద్రాక్షారామ శ్రీ మాణిక్యాంబ సమేత శ్రీ భీమేశ్వరస్వామి వారికి కొత్త రథం సిద్ధమవుతోంది. 1960లో దాతల సహకారంతో దేవదాయ, ధర్మదాయ శాఖ పాత రథాన్ని నిర్మించింది. 63 ఏళ్ల నాటి ఆ రథం ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. దీనిని గమనించిన రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ నూతన రథం నిర్మాణానికి సంకల్పించారు. పలువురి సహకారంతో నూతన రథం నిర్మాణం చేపట్టారు. కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామి చేతుల మీదుగా నూతన రథం నిర్మాణానికి డిసెంబర్ 18న అంకురార్పణ చేశారు. శ్రీకాకుళానికి చెందిన స్థపతి సింహాద్రి గణపతి ఆచార్యులు, ఆయన శిష్యబృందం ఈ రథానికి రూపుదిద్దుతున్నారు. ఈయన ఇప్పటి వరకూ 89 రథాలు తయారు చేశారు. అంతర్వేది శ్రీలక్ష్మీ నృసింహస్వామి వారి నూతన రథాన్ని కూడా గణపతి ఆచార్యులే తయారు చేశారు. భీమేశ్వరస్వామి వారి నూతన రథాన్ని 27 అడుగుల ఎత్తున.. మొత్తం బస్తరు టేకుతో నిర్మిస్తున్నారు. ఇందుకు దాదాపు రూ.1.50 కోట్లు ఖర్చు చేస్తున్నారు. వచ్చే నెల 2న ద్రాక్షారామ భీమేశ్వరస్వామి వారి కల్యాణోత్సవం, 4న రథోత్సవం జరగనున్నాయి. ఆనాటికి నూతన రథం నిర్మాణం పూర్తి చేయనున్నారు.

స్వామి రథానికి ఎంతో ప్రాధాన్యం

భీమేశ్వరస్వామి వారి రథానికి ఎంతో ప్రాధాన్యం ఉంది. స్వామివారి కల్యాణోత్సవం జరిగిన మూడో రోజున మాణిక్యాంబ అమ్మవారిని, భీమేశ్వరస్వామిని ఆలయం నుంచి ద్రాక్షారామలోని సూర్య, చంద్ర వీధుల గుండా ఊరేగిస్తూ వేగాయమ్మపేట వద్ద ఉన్న ఆస్థాన మంటపం వద్దకు తీసుకు వస్తారు. ఆ రాత్రికి స్వామి, అమ్మ వార్లకు ధూప సేవలు చేసి, మర్నాడు తిరిగి అదే రథంపై తిరిగి ఆలయానికి చేర్చుతారు. అనంతరం రథాన్ని లోపల ఉంచేస్తారు. ఇలా ఏడాదికి ఒక్క రోజు మాత్రమే స్వామివారికి రథోత్సవం చేస్తారు. ఇందులో వేలాదిగా భక్తులు పాల్గొంటారు.

45 రోజుల్లోనే..



అంతర్వేదిలో రథం నిర్మిస్తున్నప్పుడే ద్రాక్షారామ భీమేశ్వర స్వామి వారికి కూడా నూతన రథం తయారు చేయాలని మంత్రి వేణు చెప్పారు. ఈ మేరకు నూతన రథాన్ని కేవలం 45 రోజుల్లోనే పూర్తి చేస్తున్నాం. ఇప్పటి వరకూ నేను తయారు చేసిన వాటిల్లో ఇది 90వ రథం.

– సింహాద్రి గణపతి ఆచార్యులు, స్థపతి

పూర్వజన్మ సుకృతం



మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి వారికి నూతన రథ నిర్మాణం నా హయాంలో జరగడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాను. స్వామివారి ఆశీస్సులు, అందరి సహకారంతో దీనిని నిర్మిస్తున్నాం.

– చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి

మంత్రి వేణు ప్రతిపాదించారు



ఆలయానికి వచ్చిన మంత్రి వేణు శిథిలావస్థలో ఉన్న రథాన్ని గమనించి కొత్తది నిర్మించాలని భావించారు. డిపార్టుమెంటు ద్వారా కాకుండా స్వయంగా ఆయన విరాళంతో పాటు బంధువులు, స్నేహితుల సహకారంతో దీనిని నిర్మిస్తున్నారు.

– పి.తారకేశ్వరరావు, ఈఓ, భీమేశ్వరస్వామి వారి దేవస్థానం, ద్రాక్షారామ

ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం



విజేతలకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న కలెక్టర్ మాధవీలత తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): జిల్లాలో 18 ఏళ్లు నిండిన యువత ఓటు హక్కును కలిగి ఉండాలని కలెక్టర్ మాధవీలత అన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక శ్రీవెంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో జిల్లా స్థాయి ఓటరు దినోత్సవ కార్యక్రమ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొనగా, జిల్లా జాయింట్ కలెక్టరు తేజ్ భరత్, మున్సిపల్ కమిషనర్ నేష్ కుమార్ హాజరయ్యారు. కొత్తగా ఓటు నమోదు చేసుకున్న విద్యార్థులకు ఎపిక్ కార్డులను కలెక్టర్ ప్రదానం చేశారు. జిల్లా స్థాయిలో వివిధ కళాశాలలు, పాఠశాలల్లో వ్యాసరచన, వక్తృత్వ పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా మాధవీలత మాట్లాడుతూ ఇప్పుడు సంవత్సరానికి నాలుగు సార్లు అర్హులైన యువతకు ఓటు నమోదు చేసే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించిందన్నారు. ప్రశ్నించడానికైనా మనం ముందు మన ఓటరు కావాలన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు చాలా కీలకమైందన్నారు. జాయింట్ కలెక్టరు తేజ్ భరత్ మాట్లాడుతూ ఓటర్లు భయం లేదా పక్షపాతం లేకుండా ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. కార్పొరేషన్ కమిషనరు దినేష్ కుమార్ మాట్లాడారు.

ఎమ్మెల్యే బాలరాజుకు జక్కంపూడి రాజా పరామర్శ



బాలరాజును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

కంబాలాచెరువు (రాజమహేంద్రవరం): గుండెపోటుతో రాజమహేంద్రవరంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజును వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా బుధవారం పరామర్శించారు. బాలరాజుకు గుండెపోటు రావడంతో హుటాహుటిన ఆసుపత్రిలో చేర్పి ఆయనకు శస్త్రచికిత్స చేసి, స్టంట్ అమర్చిన విషయం తెలిసిందే. ఆయన ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో ఐసీయూలో ఉన్నారు. దూర ప్రాంతం వెళ్లిన ఎమ్మెల్యే రాజా బుధవారం నగరానికి చేరుకోగానే ఆసుపత్రికి వెళ్లి బాలరాజును పరామర్శించారు. వైద్యులతో మాట్లాడారు. బాలరాజు కోలుకుంటున్నారని వైద్యులు తెలిపారు. ఏలూరు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ల నాని కూడా బాలరాజును పరామర్శించారు.

క్లుప్తంగా

లారీ ఢీకొని వ్యక్తి మృతి

మామిడికుదురు: పాశర్లపూడి కొండాలమ్మచింత సెంటర్ సమీపంలో 216వ నంబర్ జాతీయ రహదారిపై లారీ ఢీకొని పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలం చిన్నపాలెం గ్రామానికి చెందిన మల్లుల శ్రీనివాసు (48) అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని కుమారుడు వినయ్ ఫిర్యాదు మేరకు దీనిపై కేసు నమోదు చేశామని నగరం ఎస్‌ఐ షేక్ జానీబాషా బుధవారం తెలిపారు. పని ముగించుకుని అమలాపురం నుంచి ఇంటికి వెళుతున్న శ్రీనివాసును వెనుక నుంచి లారీ బలంగా ఢీ కొట్టిందన్నారు. శ్రీనివాసు మృతదేహాన్ని రాజోలు ప్రభుత్వాస్పత్రికి పంపించామని, లారీడ్రైవర్ అదుపులో ఉన్నాడని ఎస్‌ఐ తెలిపారు.

వృద్ధుడి అదృశ్యంపై కేసు


యర్రా సత్యనారాయణ (ఫైల్)

రంగంపేట: వృద్ధుడి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ టి.రామకృష్ణ తెలిపారు. జి.దొంతమూరుకు చెందిన యర్రా సత్యనారాయణ (70) బుధవారం ఉదయం ఏడు గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బంధువులు, తెలిసిన వారి ఇళ్ల వద్ద వెతికినా ఫలితం లేకపోయింది. ఆయన కుమార్తె నీలపాల సుబ్బలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

యూకో బ్యాంకు బాధితుల ఆందోళన


నిందితుడు శ్రీనివాసరావు

కాకినాడ క్రైం: సాస్థానిక యూకో బ్యాంకు గోల్డ్ అప్రయిజర్ తాడోజు శ్రీనివాసరావు నిర్వాకం ఎన్నో కుటుంబాల్లో ఆవేదన మిగిల్చింది. తాకట్టు పెట్టిన బంగారాన్ని ఏమార్చి మోసం చేయడంపై ఖాతాదారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. బ్రాంచ్ మేనేజర్ అనిత వ్యవహారశైలి వివాదానికి మరింత ఆజ్యం పోస్తోంది. బుధవారం కొందరు బాధితులు బ్యాంకుకు వెళ్లి సమాచారం అడగ్గా ఆమె బయటకి పొమ్మంటూ సెక్యూరిటీని పిలిచి ఆదేశించడం వివాదాస్పదమైంది. దీంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన బాధితులు బ్యాంకు బయట నిరసనకు దిగారు. గోల్డ్ స్కాం విషయంపై కాకినాడ టూ టౌన్ పోలీసుల్ని వివరణ కోరగా కేసు విచారణలో ఉందని బదులిచ్చారు. తనకు భవిష్యత్తులో ఉపయోగపడతారనే ఉద్దేశంతో నిందితుడు శ్రీనివాసరావు పోలీసులతో పరిచయాలు పెంచుకునే ప్రయత్నం చేశాడని విచారణలో తేలింది.

సార్వత్రిక విద్యకు సై

- ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్‌లో 17,778 చేరిక
- ఉమ్మడి 'తూర్పు'న 166 స్టడీ సెంటర్ల ఏర్పాటు
- ఏప్రిల్‌లో పరీక్షలు నిర్వహించే అవకాశం


ఓపెన్ స్కూల్ తరగతులకు హాజరైన అభ్యాసకులు

రాయవరం: ఉన్నత చదువు చదవాలని ఆశ పడినప్పటికీ అనుకోని అవాంతరాలు, ఆర్థిక ఇబ్బందులతో మధ్యలోనే ఫుల్‌స్టాప్ పెట్టేసిన వారు నిరాశ పడాల్సిన అవసరం లేదు. వివాహమైన తర్వాత.. పెద్ద వయసు వచ్చేసిన తర్వాత చదువుకోలేకపోయామే అని దిగులు పడేవారున్నారు. అటువంటి వారి చింత తీర్చేందుకు ఓపెన్ స్కూల్ (సార్వత్రిక విద్య) విధానం అందుబాటులోకి వచ్చింది. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏటా అవకాశం కల్పిస్తూ లక్షలాది మందికి విద్యాబుద్ధులు నేర్పిస్తోంది. ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్లు అందజేస్తోంది. ఓపెన్ స్కూల్ విధానం ద్వారా పన్నెండేళ్లుగా జిల్లాలో సుమారు లక్ష మందికి పైగా టెన్త్, ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులై, సర్టిఫికెట్లు పొందారు. వీరిలో ఉద్యోగాలు సంపాదించిన వారు కూడా ఉన్నారు.

ముగిసిన అడ్మిషన్లు

ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్ ప్రవేశాలకు గత ఏడాది ఆగస్టులో సార్వత్రిక విద్యాపీఠం నోటిఫికేషన్ విడుదల చేసింది. అపరాధ రుసుంతో అడ్మిషన్లకు ఈ నెల 7వ తేదీతో గడువు ముగిసింది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో పదో తరగతికి 4,916 మంది, ఇంటర్మీడియెట్ కోర్సులలో ప్రవేశానికి 12,862 మంది దరఖాస్తు చేసుకున్నారు. మొత్తంగా 17,778 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరి కోసం 166 స్టడీ సెంటర్లు ఏర్పాటు చేశారు. షెడ్యూల్ ప్రకారం వీరికి ప్రతి ఆదివారం, రెండో శనివారం తరగతులు నిర్వహిస్తున్నారు. వీరందరికీ ఏప్రిల్ నెలలో పరీక్షలు నిర్వహించే అవకాశముంది. త్వరలోనే పరీక్షల షెడ్యూల్ విడుదల కానున్నట్లు సమాచారం.

రెగ్యులర్ విద్యతో సమానంగా..

ఇంటర్ అభ్యాసకులకు సీఈసీ, హెచ్ఈసీ, ఎంఈసీ, ఎంపీసీ, బైపీసీ, ఎంబైపీసీ కోర్సులను సార్వత్రిక విద్యా పీఠం అందజేస్తోంది. రెగ్యులర్ ఇంటర్‌లో రెండేళ్లు చదివే కోర్సును ఇక్కడ ఒక్క ఏడాదిలోనే పూర్తి చేసే అవకాశం ఉంది. ఈ సర్టిఫికెట్‌కు రెగ్యులర్ ఇంటర్‌తో సమానంగా విలువ ఉంటుంది. రెగ్యులర్ ఇంటర్‌లో కొన్ని సబ్జెక్టులు ఉత్తీర్ణులై, మరికొన్ని ఫెయిలైన విద్యార్థులు ఓపెన్ ఇంటర్‌లో అడ్మిషన్ పొందితే.. రెగ్యులర్ ఇంటర్‌లో పాసైన వాటిల్లో ఏవైనా రెండు సబ్జెక్టులను సార్వత్రిక ఇంటర్‌కు బదలాయించుకుని, మిగిలినవి మాత్రమే రాసుకునే వెసులుబాటు ఇస్తారు. పదో తరగతికి కూడా ఇదే విధంగా అవకాశముంది.

ఎన్నో ప్రయోజనాలు

- సార్వత్రిక విద్య ద్వారా టెన్త్, ఇంటర్‌లో ప్రవేశం పొందిన 15 – 19 సంవత్సరాల వయస్సు ఉన్న అభ్యాసకులు స్కాలర్‌షిప్ పొందే అవకాశముంది. వారి బ్యాంకు ఖాతాలో ప్రభుత్వం నేరుగా రూ.2 వేలు జమ చేస్తోంది.
- ఉచితంగా స్టడీ మెటీరియల్ అందిస్తోంది.
- పదో తరగతి అర్హతతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భర్తీ చేసే అన్ని ఉద్యోగాలూ పొందే వీలు వీరికి కూడా ఉంటుంది.
- టెన్త్ తర్వాత ఇంటర్, ఐటీఐ, నర్సింగ్ తదితర కోర్సులలో అడ్మిషన్లు పొందవచ్చు.
- రెగ్యులర్ కోర్సులు పూర్తి చేసే అవకాశముంది.
- పదో తరగతితో ఉద్యోగం పొందిన వారందరూ ఓపెన్ ఇంటర్ పూర్తి చేసి, పదోన్నతులు పొందవచ్చు.
- అలాగే సార్వత్రిక విద్య ద్వారా ఎంపీసీ పూర్తి చేస్తే ఇంజినీరింగ్ కోర్సు చదివే అవకాశముంది.
- ఇంటర్ పూర్తి చేస్తే తర్వాత ఎటువంటి ఉన్నత విద్యనైనా అభ్యసించే వీలుంటుంది.

ఉమ్మడి జిల్లాలో ఓపెన్ పది, ఇంటర్‌లో ప్రవేశాల పట్టిక

జిల్లా	సైన్స్	నాన్ సైన్స్	మొత్తం	ఎస్ఎస్‌సీ
కోనసీమ	2,292	1,619	3,911	1,000
కాకినాడ	2,979	2,041	5,020	1,917
తూర్పు గోదావరి	2,088	1,843	3,931	1,999
మొత్తం	7,359	5,503	12,862	4,916

ఓపెన్ స్కూల్ చదువుతో పదోన్నతి



దేవదాయ, ధర్మదాయ శాఖలో చిరుద్యోగిగా పని చేస్తున్నా. ఏపీ సార్వత్రిక విద్యాపీఠం ద్వారా ఇంటర్ ఉత్తీర్ణత సాధించడం ద్వారా పదోన్నతికి అర్హత కలిగింది. నాలాంటి వారెందరికో ఓపెన్ స్కూల్ విధానం ఉపయోగకరంగా ఉంది.

– పేకేటి అన్నపూర్ణాదేవి, అయినవిల్లి

డీఈఈ సెట్‌లో స్టేట్ ర్యాంకు



ఓపెన్ ఇంటర్ పాసై, ఏపీ డీఈఈ సెట్‌లో 17వ ర్యాంకు సాధించాను. మధ్యలో చదువు మానేసిన వారికి ఓపెన్ ఇంటర్ ఎంతో ప్రయోజనకరంగా ఉంది.

– నిమ్మకాయల శిరీష, జిల్లా విద్యా శిక్షణా సంస్థ విద్యార్థిని, బొమ్మూరు

ఏటేటా ప్రవేశాలు పెరుగుతున్నాయి



ఏపీ సార్వత్రిక విద్య పట్ల ప్రజల్లో అవగాహన, ఆదరణ పెరిగాయి. అనివార్య కారణాలతో మధ్యలో బడి మానేసిన వారికి ఓపెన్ టెన్త్, ఇంటర్ చదువు ఒక వరంగా మారింది. ఏటేటా ప్రవేశాలు పెరుగుతున్నాయి. గత ఏడాదికి మించి ఈసారి అడ్మిషన్లు జరిగాయి. స్టడీ సెంటర్లలో పకడ్బందీగా తరగతులు నిర్వహిస్తున్నాం.

– పి.సాయి వెంకటరమణ, జిల్లా కన్వీనర్, ఏపీ ఓపెన్ స్కూల్, అమలాపురం

కిడ్నాపైన యువకుడు సేఫ్

- ఐ.పంగిడి– కాపవరం మధ్య వదిలివేసిన కిడ్నాపర్లు
- విచారణ చేపట్టిన పోలీసులు
- తండ్రి నుంచి డబ్బు రాబట్టడం కోసమే కిడ్నాప్ నాటకమనే అనుమానాలు

నిడదవోలు రూరల్: మండలంలోని సమిశ్రగూడెంలో ఈ నెల 24న ఉదయం కిడ్నాపైన నిచ్చెనకోళ్ల వెంకటేష్‌ను హైడ్రామా మధ్య మంగళవారం అర్ధరాత్రి కొవ్వూరు మండలం ఐ.పంగిడి-కాపవరం మధ్య అడ్డరోడ్డులో కిడ్నాపర్లు వదిలేసి వెళ్లారు. కొవ్వూరు డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ పర్యవేక్షణలో ఇద్దరు సీఐలతో పాటు ఏడుగురు ఎస్‌ఐలు, పోలీస్ సిబ్బంది ప్రత్యేక బృందాలతో ఉదయం నుంచే గాలింపు చర్యలు చేపట్టారు. కోరుపల్లికి చెందిన వెంకటేష్ టీవీఎస్ మోపెడ్‌పై వెళుతుండగా దుండగులు సమిశ్రగూడెం– వేలివెన్ను రోడ్డులో అడ్డగించి బలవంతంగా కారు ఎక్కించుకున్నారు. కొద్దిసేపటి తరువాత కిడ్నాపర్లు పలుమార్లు ఆ యువకుడి సెల్ నుంచే తండ్రి రాముకు ఫోన్ చేసి రూ.30 లక్షల డిమాండ్ చేయడంతో సమిశ్రగూడెం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తనను ఇద్దరు వ్యక్తులు బలవంతంగా కారు ఎక్కించి చిక్కాల, దేవరపల్లి, కొయ్యలగూడెం ప్రాంతాల్లో తిప్పినట్టు వెంకటేష్ పోలీసులకు చెప్పినట్లు తెలుస్తోంది. ఆ యువకుడు కొన్ని పొంతన లేని సమాధానాలు చెప్పడంతో అతనిపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వెంకటేష్ తండ్రికి ఫోన్ చేసి మొదటిగా రూ.30 లక్షలు డిమాండ్ చేయగా, మళ్లీ సాయంత్రం ఫోన్ చేసి రూ.6 లక్షలైన ఇవ్వకపోతే మీ కొడుకుని చంపేస్తామని కిడ్నాపర్లు హెచ్చరించారు. దీంతో ఐ.పంగిడి వద్ద కిడ్నాపర్లు చెప్పిన స్థలంలో రూ.6 లక్షలు నగదు పెట్టి పోలీసులు మాటు వేశారు. ఈ విషయం కూడా పసిగట్టిన కిడ్నాపర్లు ఆ డబ్బు తీసుకోకుండానే ఎట్టకేలకు వెంకటేష్‌ను వదిలి వెళ్లినట్లు తెలుస్తోంది. కిడ్నాపైన యువకుడు ఇటీవల జరిగిన కోడి పందేలతో పాటు క్రికెట్ బెట్టింగ్‌లో డబ్బులు పోగొట్టుకోవడంతో తన స్నేహితులతో కలిసి తండ్రి రాము వద్ద డబ్బులు లాగేందుకు ప్లాన్ చేసినట్లు అనుమానాలు వ్యక్తం అయ్యాయి. పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది.

అభయారణ్యంలో 39,816 పక్షులు


అభయారణ్యంలో పక్షుల సమూహం


పక్షుల గణన చేపడుతున్న అధికారులు

తాళ్లరేవు: నీటి పక్షుల గణన-2023 ద్వారా కోరంగి అభయారణ్యంలో 39,816 పక్షులు ఉన్నట్లు గుర్తించామని వన్యప్రాణి విభాగం అధికారి ఎస్ఎస్ఆర్ వరప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పక్షుల గణనకు సంబంధించి ఈ నెల 9వ తేదీన నేషనల్ ఏషియన్ వాటర్ బర్డ్ సెన్సస్ కోఆర్డినేటర్, బీఎన్‌హెచ్ఎస్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర పి.సత్యసెల్వం, ఐబీసీఎన్ స్టేట్ కోఆర్డినేటర్ కె.మృత్యుంజయరావు ఆధ్వర్యంలో సిబ్బందికి అవగాహన కల్పించినట్లు తెలిపారు. అటవీ శాఖ అధికారులు, పర్యావరణ ఔత్సాహికులు 12 బృందాలుగా ఏర్పడి నీటి పక్షుల ఆవాస ప్రాంతాలైన హోప్‌ఐలాండ్, ఏటిమొగ, కోరంగి, గాడిమొగ, భైరవపాలెం ప్రాంతాలలో ఈ నెల 10వ తేదీన గణన చేపట్టినట్లు తెలిపారు. వీటిలో 103 జాతులకు చెందిన 39,816 పక్షులను గుర్తించామని బయోలజిస్ట్ డి.మహేష్‌బాబు తెలిపారు. జిల్లా అటవీ అధికారి ఐకేవీ రాజు, ఫారెస్ట్ రేంజర్ ఎస్ఎస్ఆర్ వరప్రసాదరావు పర్యవేక్షించారు.

అంతర్వేది ఉత్సవ ఏర్పాట్లపై సమీక్ష


అంతర్వేది టూరిజం గెస్ట్‌హౌస్‌లో ఉత్సవాలపై సమీక్ష చేస్తున్న జేసీ ధ్యానచంద్ర

సఖినేటిపల్లి: అంతర్వేది క్షేత్రంలో త్వరలో ప్రారంభంకానున్న లక్ష్మీనృసింహుని తీర్థ మహోత్సవాలు సమష్టి కృషితో విజయవంతం చేయాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా జేసీ ధ్యానచంద్ర సూచించారు. బుధవారం రాత్రి అంతర్వేది టూరిజం గెస్ట్‌హౌస్‌లో ఈ నెల 28వ తేదీ నుంచి ఫిబ్రవరి 6వ తేదీ వరకూ జరగనున్న ఉత్సవాలపై జేసీ వివిధ శాఖల అధికారులతో సమీక్ష చేశారు. భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాల గురించి అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ వివరించారు. భక్తుల భద్రతకు జిల్లా పోలీసు ఉన్నతాధికారుల సూచనలతో తీసుకుంటున్న చర్యలను స్థానిక పోలీసు అధికారులు వివరించారు. వీటితో పాటు మెడికల్ అండ్ హెల్త్‌కు సంబంధించిన చర్యలను, శానిటేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, ఎక్సైజ్, ఫైర్, ఫిషరీస్, ఇరిగేషన్ తదితర శాఖల పనులు పురోగతిని ఆయా అధికారులు, జిల్లా జేసీకి వివరించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ స్వామివారి కల్యాణం, రథోత్సవం, పౌర్ణమి సముద్ర స్నానాల సందర్భంగా రద్దీని అనుసరించి అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ట్రాఫిక్ జామ్ కాకుండా చూడాలని పోలీసులకు సూచించారు. అనంతరం క్షేత్రంలో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, సర్పంచ్ కొండా జాన్ బాబు, తహసీల్దారు వై.రామకుమారి, ఎంపీడీవో జి.భీమారావు, ఎస్‌ఐ అడపా ఫణిమోహన్, డీఎల్పీవో జి.మల్లికార్జునరావు, డిప్యూటీ తహసీల్దారు సీహెచ్ భాస్కర్, దేవస్థానం సూపరింటెండెంట్ విజయ సారథి, రామేశ్వరం పీహెచ్‌సీ వైద్యాధికారి యునుస్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

43 మందిపై రౌడీషీట్ల తొలగింపు

పిఠాపురం: పదేళ్లుగా సత్ప్రవర్తన కలిగినందుకు పిఠాపురం నియోజకవర్గ పరిధిలో 43 మందిపై రౌడీ, సస్పెక్ట్ షీట్లు తొలగించినట్లు పిఠాపురం సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపారు. ఎటువంటి గొడవలు, కేసులు లేకుండా వయసు పైబడిన వారిని గుర్తించి వారిపై రౌడీ, సస్పెక్ట్ షీట్లు తొలగించి జన జీవన స్రవంతిలో కలిసేలా చూడాలని జిల్లా ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు ఆదేశించించినట్లు ఆయన తెలిపారు. దీంతో కాకినాడ డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి 43 మందిపై ఉన్న షీట్లును తొలగించారని తెలిపారు. ప్రత్యేక కమిటీని నియమించి అన్ని రకాలుగా పరిశీలించాక సక్రమమైన మార్గంలో ఉన్నవారికి మాత్రమే అవకాశం కల్పించినట్లు ఆయన తెలిపారు.

ఏపీఆర్ సెట్ అభ్యర్థులకు పీహెచ్‌డీ అడ్మిషన్లు


పీహెచ్‌డీ అడ్మిషన్లు పొందిన అభ్యర్థులు

బాలాజీచెరువు: ఏపీ రీసెర్చ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్–2023లో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు కల్పించే పీహెచ్‌డీ అడ్మిషన్ల కేటాయింపు బుధవారం జేఎన్‌టీయూకేలో నిర్వహించారు. వర్సిటీ డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన అడ్మిషన్ల ప్రక్రియలో 60 మందికి ప్రవేశాలు కల్పించారు. వివిధ కారణాలతో హాజరుకాలేకపోయిన వారికి ఈ నెల 27, 28 తేదీల్లో అడ్మిషన్లు నిర్వహిస్తామని రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ రవీంద్ర తెలిపారు. అడ్మిషన్లు పొందిన అభ్యర్థులను వర్సిటీ వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు, రెక్టార్ రమణ, అడ్మిషన్ డైరెక్టర్ కె.పద్మరాజు అభినందించారు.

అద్దెకు దిగి అదను చూసి దోపిడీ

పిఠాపురంలో వృద్ధురాలిని బంధించి బంగారు నగల చోరీ


బాధితురాలు సూర్యప్రభావతి

పిఠాపురం: అద్దెకు ఇల్లు ఇచ్చిన వృద్ధురాలిని ఎవరూ లేని సమయం చూసి బంధించి ఆమె వద్ద ఉన్న బంగారు నగలు దోచుకెళ్లిన ఘటన పిఠాపురంలో బుధవారం కలకలం రేపింది. ఉద్యోగులమని చెప్పి ఇద్దరు వ్యక్తులు 20 రోజుల క్రితం పిఠాపురం సీతయ్యగారితోటలో నివాసముంటున్న కొత్తపల్లి సూర్యప్రభావతి ఇంట్లో అద్దెకు దిగారు. పండగకు ఊరెళ్లి వస్తామని చెప్పి వెళ్లినవారు మంగళవారం ఇంటికి వచ్చారు. బుధవారం ఉదయం తాము ఉన్న గదిలో సింక్‌లో నీళ్లు రావడం లేదని పిలిచారు. ఆమె కుమారుడు తిరుపతి వెళ్లగా ఇంట్లో వారందరూ పని మీద బయటకు వెళ్లి పోవడంతో ఇంట్లో ఉన్న వృద్ధురాలు సూర్యప్రభావతి పక్క గదిలోకి వెళ్లి ఏమి జరిగిందని అద్దెకు వచ్చిన వారిని అడిగారు. ఆ ఇద్దరు ఆమె చేతులు, కాళ్లు కట్టేసి ఎనిమిది బంగారు గాజులు, మెడలో గొలుసు, చెవి దుద్దులు, కాళ్ల పట్టీలు, సెల్‌ఫోన్ లాక్కున్నారు. ఆమెను ఇంట్లో ఉంచి తలుపులు గడియపెట్టి పారిపోయారు. చివరకు ఆమె తేరుకుని తలుపులను గట్టిగా కొట్టడంతో ఇంటి పక్క వారు వచ్చి విడిపించి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పిఠాపురం సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ ఘటనా స్థలాన్ని పరిశీలించగా డాగ్, క్లూస్ టీం ఆధారాలు సేకరించాయి. ఎస్‌ఐ జగన్మోహన్ దర్యాప్తు చేస్తున్నారు.